క్లుప్తంగా

22న మెగాజాబ్ మేళా

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 22వ తేదీన మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయ ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెటిరో, అపోలో, మెడీప్లస్, డెక్కన్, కోజెంట్ తదితర 9 రకాల కంపెనీలతో పాటు ఐసీఐసీఐ బ్యాంకులో ఉద్యోగాల కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ కెమిస్ట్రీతో పాటు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన 18 నుంచి 40 ఏళ్ల మధ్య ఉన్న స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలలో వసతుల పరిశీలన


విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాజేశ్వరి

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం ప్రాథమిక పాఠశాలలో నాడు–నేడు పథకంలో భాగంగా కల్పించిన వసతులను జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి సోమవారం పరిశీలించారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు ఇతర సదుపాయాలతో పాటు మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి పాఠ్య పుస్తకాలు, బ్యాగులు పూర్తిస్థాయిలో అందాయా లేదా, భోజనాలు రుచికరంగా ఉంటున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

గోదాదేవి అమ్మవారికి పల్లకీసేవ


అమ్మవారి పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

జామి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా అన్నంరాజుపేట పంచాయతీలోని పుష్పగిరి గ్రామ వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారికి పల్లకీసేవ సోమవారం నిర్వహించారు. అంతకుముందు వేణుగోపాలస్వామి, గోదాదేవి అమ్మవారిని ఆలయ ప్రధాన అర్చకులు సీతారామాచార్యులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు,అభిషేకాలు చేశారు.

బాల్య వివాహాలు నేరం


ర్యాలీ చేస్తున్న అధికారులు, నాయకులు

గుర్ల: బాల్య వివాహాలు చేయడం నేరమని ఎంపీడీఓ కల్యాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల కేంద్రంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలికలు అంతా తప్పనిసరిగా చదువుకోవాలని, 18 ఏళ్లు దాటిన తర్వాతే వివాహం గురించి ఆలోచించాలన్నారు. ఏపీఎం నారాయణరావు, ఏపీఓ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన


కొరారుబిల్లిలో చిన్నారులకు అందించిన భోజనాలను పరిశీలిస్తున్న పీడీ శాంతకుమారి

గంట్యాడ: మండలంలోని రావివలస, కొరారుబిల్లి అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా స్త్రీ,శిశు సంక్షేమశాఖ సాధికా రిత అధికారి(ఐసీడీఎస్ పీడీ) బి.శాంతకుమారి సోమవారం పరిశీలించారు. అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె చేస్తున్న నేపథ్యంలో సచివాలయ సిబ్బంది ద్వారా కేంద్రాలను తెరిపిస్తున్నారు. కేంద్రాల్లో చిన్నారులకు భోజనాలు పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. ఆమె వెంట సీడీపీఓ ఉమాభారతి తదితరులు ఉన్నారు.

పాఠశాలలకు ట్యాబ్‌లు అందజేత


ట్యాబ్‌లను అందజేస్తున్న ఎంఈఓలు

గజపతినగరం: ప్రభుత్వ పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా ట్యాబ్‌లు అందజేయనుంది. మండలానికి ఈ ఏడాదికి మొదటి విడతగా 544 ట్యాబ్‌లు రావాల్సి ఉండగా సోమవారం 340 ట్యాబ్‌లు వచ్చాయి. వాటిని స్థానిక విద్యావనరుల కేంద్రంలో పాఠశాలల వారీగా ఎంఈఓలు విమలమ్మ, సాయిచక్రధర్ సోమవారం అందజేశారు. మిగిలిన ట్యాబ్‌లు కూడా రెండు రోజుల్లో రానున్నాయని, వచ్చిన వెంటనే పాఠశాలలకు వాటిని చేరవేస్తామని ఎంఈఓలు చెప్పారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి


శృంగవరపుకోట: ఎస్.కోట ధారగంగమ్మ ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం


లక్కవరపుకోట: పెదిరెడ్లపాలెంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి రోడ్డులోని ధారగంగమ్మ ఆలయ ప్రాంగణంలో, ఉమాకోటిలింగేశ్వరస్వామి ఆలయాల్లో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం క్షీరాభిషేకాలు, అర్చన, పూజాధికాలు అనంతరం ధారగంగమ్మ ఆలయ అర్చకులు రాజగోపాలాచార్యులు నేతృత్వంలో, దేవస్థాన బోర్డు సభ్యులు, ఉద్యోగులు, భక్తులు కలిసి వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి దేవతామూర్తులను పల్లకిలో ఊరేగించారు. కల్యాణకర్తలు మళ్ల నవీన్,సంధ్య, ఉప్పల నరసింగరావు,వెంకటరత్నం, బుడ్డిగ సురేంద్రకుమార్,హేమలత దంపతుల ఇళ్లకు తీసుకెళ్లి పూజలు చేశారు. అక్కడి నుంచి ధారగంగమ్మ ఆల య ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణవేదిక వద్దకు తీసుకొచ్చి అర్చకులు, వేదపండితులు కమనీయంగా కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

శివాలయంలో..

స్థానిక శివాలయంలో ఆలయ అర్చకులు రెడ్డి అయ్యప్పశర్మ నేతృత్వంలో మధ్యాహ్నం సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి క్షీరాభిషేకాలు, పూజలు చేశారు.

వేపాడ రామాలయంలో...

వేపాడ: స్థానిక రామాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి సందర్భంగా ప్రత్యేక పూజలు,అభిషేకం నిర్వహించారు. అర్చకులు గోపాజోస్యుల సాయిరాంశర్మ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పాలాభిషేకం, అష్టోత్తర శతనామ పూజలు చేశారు.


కొత్తవలస: మంగళపాలెంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు


వేపాడ: వేపాడ రామాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


కొత్తవలస: మంగళపాలెంలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద అన్నసమారాధన


గజపతినగరం: పురిటిపెంటలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, భక్తులు

పురిటిపెంటలో..

గజపతినగరం: సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి సందర్భంగా పురిటిపెంట సంతతోట కాలనీలోని ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అర్చకులు మణికంఠ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ బెల్లాన జ్ఞాన దీపిక స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

మంగళపాలెంలో..

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామ సమీపంలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో షష్ఠి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారి కల్యాణం జరిపించారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు అన్నసమారాధన చేశారు.

లక్కవరపుకోట: పెదిరెడ్లపాలెం గ్రామంలోని షిర్డీసాయి సహిత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు.మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

తాగునీటి పథకం పనులకు శంకుస్థాపన


వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ జగ్గుబాబు, గ్రామపెద్దలు

వేపాడ: మండలంలోని పెదకృష్ణరాజపురం పంచాయతీ శివారు గదబవలస గ్రామంలో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేసే పథకం పనులకు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సర్పంచ్ ముమ్మలూరి జగ్గుబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. గదబవలస గ్రామ గిరిజనుల తాగునీటి సమస్య పరిష్కరించేందుకు రూ.35.20 లక్షల జలజీవన్ మిషన్ పథకం నిధులతో పదివేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు నిర్మించడంతో పాటు ఇంటింట కుళాయి లు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. స్థానిక నాయకులు కిలపర్తి మురళీకృష్ణ, సత్తిబాబు, రామారావు, కృష్ణ, బి.వెంకటరావు, వై.చక్రపాణి, జి.బుచ్చిబాబు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వినియోగిద్దాం..


చీపురుపల్లి: ఇంధన పొదుపుపై చీపురుపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు


గజపతినగరం: ఇంధన పొదుపుపై గజపతినగరంలో అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

చీపురుపల్లి: విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వృథా చేయవద్దని ఏపీఈపీడీసీఎల్/ఆర్‌ఈసీఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.భీమరాజు అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఇంధన పొదుపుపై ఆర్‌ఈసీ ఎస్ ప్రధాన కార్యాలయం నుంచి పట్ట ణంలోని పలు ప్రాంతాల మీదుగా విద్యుత్ ఉద్యోగులు సోమవారం అవగా హన ర్యాలీ నిర్వహించారు. భీమరాజు మాట్లాడుతూ మూడు, నాలుగు స్టార్లు ఉన్న విద్యుత్ గృహోపకరణాలనే వినియోగించాల న్నారు. దీని ద్వారా విద్యుత్ ఆదా అవుతుందని అంతేకాకుండా బిల్లు కూడా తక్కువ వస్తుందని చెప్పారు. చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం ఏఈలు వై. సూర్యప్రభాకర్, ఎస్. సన్యాసినాయుడు, ఏ.రమేష్, ఆర్‌ఈసీఎస్ ఉద్యోగులు ఎస్.రాధాకృష్ణ, ఆర్.ఆనంద్‌పట్నాయక్, జూనియర్ లైన్‌మన్లు, ఎనర్జీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గజపతినగరంలో కళాజాత

గజపతినగరం: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా పొదుపుగా విద్యుత్‌ను వినియోగించాల్సిన ఆవశ్యకతపై మండల కేంద్రంలో విద్యుత్ శాఖ ఏడీఈ శివకుమార్ ఆధ్వర్యంలో సోమవారం కళాజాత నిర్వహించారు. విద్యుత్ శాఖ ఏఈ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పేదల పక్షపాతి


గుర్ల: చింతలపేట సచివాలయం వద్ద పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న, ప్రజాప్రతినిధులు, నాయకులు


లక్కవరపుకోట: సీతారాంపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణలో ఎంపీపీ శ్రీనివాసరావు, తదితరులు

గుర్ల: పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న పేదల పక్షపాతి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు కోరారు. చింతలపేట గ్రామంలో 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సచివాలయం వద్ద పథకాల డిజిటల్ బోర్డుల ను ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కె.వి. సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, జేసీఎస్ కన్వీనర్ బెల్లాన బంగారునాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, సర్పంచ్ పతివాడ భాస్కరరావు, ఎంపీటీసీ జమ్ము అప్పలనాయుడు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

లక్కవరపుకోట: పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అన్నారు. సీతారాంపురం గ్రామంలో 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించడంతో పాటు గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఇంటింట ప్రచారం చేశారు. సర్పంచ్ తూర్పాటి లక్ష్మి, ఉప సర్పంచ్ ద్వారపూడి సత్యారావు, నాయకులు తూర్పాటి సోంబాబు, గొర్లె శ్రీరాములు,ఏడువాక రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

శృంగవరపుకోట/లక్కవరపుకోట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రీన్ అంబాసిడర్లు ఎస్.కోట, ఎల్.కోట ఎంపీడీఓ కార్యాలయాల వద్ద సోమవారం ధర్నా చేశారు. గ్రీన్ అంబాసిడర్లకు వెంటనే బకాయి జీతాలు చెల్లించాలని, కనీస వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు.తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 26, 27, 28 తేదీల్లో కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహిస్తామని, ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెకి వెళ్తామని తెలిపారు. ఎంపీడీఓలు శేషుబాబు, రూపేష్‌కు వినతిపత్రాలు అందజేశారు. సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

ప్రయాణికులకు బహుమతులు


ప్రయాణికులకు బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజర్ రమేష్

శృంగవరపుకోట: పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులకు ఎస్.కోట డిపోమేనేజర్ సోమవారం బహు మతులు అందజేశారు. డిపో పరిధిలో ఎస్.కోట–విజయనగరం వయా జామి, తాటిపూడి, కొట్యాడ రూట్లలో, గుమ్మకోట రూట్లో ఉన్న పల్లెవెలుగు సర్వీసుల్లో గిఫ్ట్‌స్కీమ్ ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా ఈనెల 1వ తేదీ నుంచి ప్రయాణించిన ప్రయాణికుల టికెట్లను లక్కీడిప్ ద్వారా డ్రా తీసి విజేతలను ఎంపిక చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ నేత కె.కోటేశ్వరరా వు సౌజన్యంతో ఏర్పాటు చేసిన బహుమతులను గుమ్మకోట రూట్‌లో కె.బి.మహాలక్ష్మి, జామి రూట్లో కె.హైమ, తాటిపూడి రూట్లో ఎస్.కె.నాగేంద్రరావు, కొట్యాడ రూట్లో ఎం.లక్ష్మికి అందజేశారు. ప్రయాణికుల కోరిక మేరకు భవానీ దీక్షల విరమణకు, వైష్ణవ దేవాలయాల సందర్శనకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తామని డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు.

ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ నేడు

గజపతినగరం: స్థానిక గ్రామ సచివాలయం –1లో మంగళవారం ఆరోగ్య శ్రీ పథకంపై అవగాహన సదస్సుతో పాటు ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ కిశోర్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అతిథిగా ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హాజరు కానున్నారని, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభం

లక్కవరపుకోట: మల్లివీడు, గనివాడ సచివాలయాల పరిధిలో సచివాలయాలు, వెల్‌నెస్, రైతు భరోసా కేంద్రాల నూతన భవనాలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించనున్నారని పంచాయతీరాజ్ డీఈ స్వామినాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన


మాట్లాడుతున్న ఏఓ శ్యామ్‌కుమార్

గంట్యాడ: మండలంలోని పెదవేమలి ఆర్బీకేలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఓ శ్యామ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ముందుగా రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. ధాన్యం క్వింటాల్ సాధారణ రకం రూ.2,183, గ్రేడ్–ఏ రకం రూ. 2,203 ప్రభుత్వం చెల్లిస్తోందని చెప్పారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు చలుమూరి వాసుదేవరావు, ఎంపీటీసీ పొటుపు రెడ్డి భవాని, సర్పంచ్ పాపునాయుడు, వీఏఏ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం


గంట్యాడ: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీటీసీ భవాని, సర్పంచ్ పాపునాయుడు


జామి: కుమరాంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ ఆదిలక్ష్మి


దత్తిరాజేరు: టి.భూర్జవలసలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు అప్పలనాయుడు,తదితరులు

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామంలోని రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే)లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీటీసీ పొటుపు రెడ్డి భవాని, సర్పంచ్ వర్రి పాపునాయుడు సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకోవాలని రైతులకు సూచించారు. వీఏఏ ప్రమీల, కొనుగోలు కేంద్రం సిబ్బంది మణికంఠ, సింహాచలం, తులసమ్మ పాల్గొన్నారు.

సద్వినియోగించుకోండి..

జామి: మండలంలోని కుమరాం, ఎం.కె.వలస, అట్టాడ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఓ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల సర్పంచ్ లు సోమవారం ప్రారంభించారు. సర్పంచ్‌లు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగించుకోవాలని సూచించారు. కుమ రాం, అట్టాడ, ఎం.కె.వలస గ్రామాల సర్పంచ్‌లు పిన్నింటి ఆదిలక్ష్మి, పోతల అమ్మన్నదొర, బి.సంతోష్ కుమార్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, వీఏఏలు పాల్గొన్నారు.

దత్తిరాజేరు మండలంలో 16 కేంద్రాలు..

దత్తిరాజేరు: మండల వ్యాప్తంగా సోమవారం 16 ఆర్బీకేల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వ్యవసాయ సిబ్బందితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. టి.భూర్జవలసలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, కె.కృష్ణాపురంలో పోరలి పీఏసీఎస్ అధ్యక్షుడు సుమల శ్రీను మాట్లాడుతూ రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజనూ తడిసినా,ముక్కినా కొనుగోలు చేస్తామని చెప్పారు.

ప్రతి సోమవారం సేంద్రియ స్టాల్ ఏర్పాటు


శృంగవరపుకోట: స్టాల్‌లో కూరగాయలు కొంటున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, తదితరులు


కొత్తవలస: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసమిశ్ర


లక్కవరపుకోట: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను తిలకిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

శృంగవరపుకోట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇక నుంచి ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఉత్పత్తులతో స్టాల్ ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ డి.శ్రీనివాసరావు చెప్పారు. ఏపీ సంఘ నిర్వాహక ప్రకృతి వ్యవసాయం విభాగం ఆధ్వర్యంలో మండలంలోని పెద ఖండేపల్లి రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన కూరగాయలను సోమవారం ఏర్పాటు చేసిన స్టాల్‌లో విక్రయించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈ స్టాల్‌లో సేంద్రియ పద్ధతుల్లో పండించిన తృణధాన్యాలు, ఆకుకూరలు, కాయగూరలు అమ్మకానికి ఉంటాయన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

కొత్తవలస: రసాయన ఎరువులను వినియోగించకుండా, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని తహసీల్దార్ శ్రీనివాసమిశ్ర తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేసిన కూరగాయలతో తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆయన సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని అభినందించారు. ఏపీఎం జి.శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎం.శ్రావ్య, జి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎల్.కోటలో..

లక్కవరపుకోట: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ స్టాల్‌లో లింగంపేట యూనిట్ రైతులు కూరగాయలు విక్రయించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జానకి,పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు,

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక


పాలవలస హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న నాయకుడు సన్యాసినాయుడు, హెచ్‌ఎం సుందరమ్మ


త్రోబాల్ పోటీలకు ఎంపికైన చింతలపేట విద్యార్థులతో హెచ్‌ఎం గౌరీదేవి, పీఈటీ లక్ష్మణ్

గుర్ల: మండలంలోని పాలవలస ఉన్నత పాఠశాల నుంచి స్కూల్ గేమ్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు 29 మంది, జాతీయస్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం కె.సుందరమ్మ సోమవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు 16 మంది, హా కీ పోటీలకు 13 మంది, జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థిని కోడి దీపిక , హైజంప్ పోటీలకు పొట్నూరు హేమలత ఎంపికయ్యా రు.విద్యార్థులను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు అభినందించారు. వచ్చే ఏడాది జనవరి నెలలో నిర్వ హించే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లడానికి విద్యార్థులకు ప్రయాణ ఖర్చుల నిమిత్తం సన్యాసినాయుడు ఆర్థిక సహాయం అందజేశారని హెచ్‌ఎం చెప్పారు.

త్రోబాల్ పోటీలకు చింతలపేట విద్యార్థులు

బాల,బాలికల విభాగాల్లో రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు చింతలపేట హైస్కూల్ విద్యార్థులు ఏడుగురు ఎంపికయ్యారని పీఈటీ కె.లక్ష్మణ్ సోమవారం తెలిపారు. కె.మురళి, వి.భార్గవ్, ఎం.మణికంఠ, బి.మురళి, ఎం.యమున, ఎస్.జ్యోతిసాయి, జి.లావణ్య జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయికి అర్హత సాధించారని చెప్పారు.ఈనెల 20,21న విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం గౌరీదేవి, ఉపాధ్యాయలు అభినందించారు.

ఆరోగ్యశ్రీలో సమూల మార్పులు


కొత్తవలసలో సీఎం జగన్ ప్రసంగాన్ని వింటున్న ఎంపీపీ గోపెమ్మ, తదితరుల


దత్తిరాజేరులో సీఎం ప్రసంగాన్ని వింటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కొత్తవలస/దత్తిరాజేరు: ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఒక్కో కుటుంబం ఏడాదికి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యసేవలు పొందేలా సీఎం జగన్‌మోహన్ రెడ్డి సమూలమార్పులు చేశారని కొత్తవలస ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, దత్తిరాజేరు ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి అన్నారు. ఆరోగ్యశ్రీలో మార్పులు తీసుకువచ్చే విషయమై తాడేపల్లి నుంచి సీఎం జగన్ చేసిన ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా మండలపరిషత్ కార్యాలయా ల్లో సోమవారం తిలకించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు పైసా ఖర్చు లేకుండా ఖరీదైన వైద్యాన్ని ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. కొత్తవలసలో పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, వైద్యులు గోపాలకృష్ణ, సీతల్‌వర్మ, దత్తిరాజేరులో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, వైద్యులు సతీష్‌కుమార్,శ్రవంతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి


ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి వెళుతున్న అంగన్‌వాడీలు

చీపురుపల్లి: అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి టి.వి. రమణ కోరారు. చీపురుపల్లి రెవెన్యూ డివిజన్‌లోని చీపురుపల్లి, గరివిడి, రాజాం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్ వాడీ వర్కర్లు, ఆయాలు పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి ఆర్డీఓ బి.శాంతికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు ఏ.గౌరినాయుడు, రామ్మూర్తి నాయుడు, అంగన్‌వాడీ నాయకులు వరలక్ష్మి, మాలతి, నాగమణి, ఉమ, సరళ పాల్గొన్నారు.